క్లుప్తంగా

జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

సిరిసిల్లటౌన్: జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెలలో మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ఈనెల 27న నుంచి చెన్నైలో జరిగే జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో బోడిపోయిన శివేశ్, గౌతం, ఆనంద్, కర్నె యుతిక, గజ్జల శ్వేదిక, షేక్ అజాన్ పాల్గొంటారని జిల్లా కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వడ్నాల శ్రీనివాస్ తెలిపారు.

చందుర్తి ఠాణాను సందర్శించిన ఏఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

చందుర్తి: చందుర్తి పోలీస్‌స్టేషన్‌ను వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు, పలు ఫైళ్లను పరిశీలించారు. వినాయక మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. స్థానిక సంస్థలు ఎన్నికల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వీడాలని సూచించారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేశ్ ఉన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



పోక్సో చట్టం, బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా శిశు పరిరక్షణ అధికారి కవిత

సిరిసిల్లటౌన్: బాల్యవివాహాలు, విద్యార్థినిలను, మహిళలను ఇబ్బంది పెట్టే సంఘటనలు జరిగితే వెంటనే 1098కు సమాచారం ఇవ్వాలని జిల్లా శిశు పరిరక్షణ సమితి అధికారి(డీసీపీవో) కవిత కోరారు. పెద్దూరు బాబాజీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల, కమ్యూనిటీ ప్రజలతో బాల్యవివాహాలు, పోక్సో చట్టం, బాలకార్మికులు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌లపై మంగళవారం అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ కేసు వర్కర్ సాయిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందించాలి

తంగళ్లపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేయడం చేతగాక రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు ఆరోపించారు. మంగళవారం మండలంలోని జిల్లెల్ల రైతులతో సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలో ఏనాడూ యూరియా కొరత లేదన్నారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియా అందించాలన్నారు. ఎస్సై ఉపేంద్రచారి, వ్యవసాయాధికారి కె.సంజీవ్ చేరుకుని రాస్తారోకోను విరమింపజేశారు. జిల్లెల్ల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

1న మందకృష్ణ రాక



వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం లింగంపల్లిలో వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, నేత, గీత, బీడీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండ థామస్ మాట్లాడుతూ సెప్టెంబర్ 1న వేములవాడ పట్టణానికి పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ వస్తున్న సందర్భంగా పెన్షన్‌దారులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చేయూత పెన్షన్ పెంచి ఇవ్వాలన్నారు. వీఎస్‌పీఎస్ జిల్లా కన్వీనర్ చెడిమెల శోభారాణి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అందే సామ్యూల్, బూర్ల స్వామి, గంగవ్వ, మణమ్మ, రమ్య, యశోద, ఎల్లవ్వ, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనానికి యత్నం

ఇల్లంతకుంట: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దిష్టిబొమ్మను దహనం చేసినందుకు నిరసనగా కాంగ్రెస్ మండల నాయకులు కేంద్రమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను ఇల్లంతకుంట దహనం చేసేందుకు యత్నించారు. పోలీసులు అడ్డుకొని నిలుపుదల చేయించారు.

మహిళ అదృశ్యం

తంగళ్లపల్లి: బద్దెనపల్లికి చెందిన అంకం పూజ ఉరుఫ్ అక్షర (25) అనే వివాహిత ఈనెల 13న అదృశ్యమైంది. పూజ తల్లి అంకం రమ తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు న మోదు చేసినట్లు ఎస్సై ఉపేంద్ర చారి పేర్కొన్నారు.

మట్టి గణపతులను పూజించాలి



సిరిసిల్లటౌన్: మట్టి గణపతులు పంపిణీ చేస్తున్న కేకే మహేందర్‌రెడ్డి



సిరిసిల్ల ఎడ్యుకేషన్: మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న విద్యార్థులు



తంగళ్లపల్లి: మట్టి వినాయక ప్రతిమలతో గిరిజన డిగ్రీ కళాశాల విద్యార్థినులు



వేములవాడ : మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న ప్రతాప రామకృష్ణ



వేములవాడఅర్బన్: మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న ఈవో శ్రీనివాస్



కోనరావుపేటలో మట్టి వినాయకులతో విద్యార్థులు

- కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్/సిరిసిల్ల ఎడ్యుకేషన్/సిరిసిల్ల అర్బన్/వేములవాడ/ వేములవాడఅర్బన్/వేములవాడ రూరల్/గంభీరావుపేట/తంగళ్లపల్లి/కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/ ముస్తాబాద్/చందుర్తి/ఇల్లంతకుంట: ప్రతీ ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కే.కే మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, గోదావరి పాలిమర్స్ డీలర్ చింతోజు భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం మట్టి గణపతులను పంపిణీ చేశారు. చింతోజు నారాయణ, దుర్గాచారి, కాంగ్రెస్ నాయకులు వైద్య శివప్రసాద్, బైరినేని రాము, తదితరులు పాల్గొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌లో మండల ప్రాథమిక పాఠశాలలో మట్టి వినాయకులను తయారుచేసి పంపిణీ చేశారు. పెద్దూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది మట్టిలో కొన్ని విత్తనాలను కలిపి వినాయకులను తయారు చేశారు. వేములవాడ మండలం అగ్రహారం శ్రీహనుమాన్ ఆలయంలో మట్టిగణపతులను పంపిణీ చేశారు. ఆలయ ఈవో నాగరపు శ్రీనివాస్, అర్చకులు, తదితరులున్నారు. వేములవాడలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మట్టి గణనాథులను పంపిణీ చేశారు. అగ్రహారం శ్రీహనుమాన్ ఆలయంలో మట్టి గణనాథులను పంపిణీ చేశారు. తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు తయారుచేసిన మట్టి వినాయకులను మండలవాసులకు పంపిణీ చేశారు. కోనరావుపేట మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లగొల్లపల్లి, మండలకేంద్రంలో, హెచ్‌పీ పెట్రోల్ పంపు నిర్వాహకులు సమకూర్చిన 110 మట్టి వినాయక ప్రతిమలను సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రాహుల్‌రెడ్డి పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో, చందుర్తి మండలం జోగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, వినాయక ప్రతిమలను అందించారు. వేములవాడ రూరల్ మండలం వట్టెంల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేశారు. ముస్తాబాద్ మండలం పోతుగల్ జెడ్పీ ఉన్నత పాఠశాల, గంభీరావుపేట మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మట్టి గణపతులను తయారు చేశారు. ఇల్లంతకుంట మండలకేంద్రంలో మట్టి గణపతలను పూజించాలని విద్యార్థులు ర్యాలీ తీశారు. ఆయా కార్యక్రమంలో అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్య

- డీడబ్ల్యూవో లక్ష్మీరాజం



సిరిసిల్లలో బీసీ గురుకుల పాఠశాలను పర్యవేక్షిస్తున్న డీడబ్ల్యూవో లక్ష్మీరాజం

సిరిసిల్లటౌన్: కార్పొరేట్ సంస్థలకు దీటుగా గురుకులాల్లో నాణ్యమైన విద్య అందుతుందని డీడబ్ల్యూవో లక్ష్మీరాజం పేర్కొన్నారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆన్‌లైన్ ద్వారా ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్సుల తరగతుల నిర్వహణను మంగళవారం పర్యవేక్షించారు. విద్యానగర్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ బోనాల రోజాతోపాటు సందర్శించి విద్యార్థినిలతో మాట్లాడారు.

బీఆర్ఎస్ చేపట్టిన పనులను వివరించాలి



మాట్లాడుతున్న బొల్లి రాంమోహన్

ముస్తాబాద్: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలని ఆపార్టీ ఎన్నికల పరిశీలకులు బొల్లి రాంమోహన్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని, ఇరవై నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కేటీఆర్ చేసిన సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికి వివరించాలన్నారు. పార్టీ కార్యకర్తలు ఐకమత్యంగా ఉండి స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, సంతోష్‌రావు, చెవుల మల్లేశ్, ముక్క మల్లయ్య, మనోహర్, నవాజ్, స్వామి, జహంగీర్, నర్సింలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

వేములవాడరూరల్: విద్యార్థినులకు పోషకాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మెడికల్ ఆఫీసర్లు జి. లహరి, సాయి వైష్ణవి అన్నారు. వేములవాడ పరిధిలోని శాత్రాజుపల్లిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో వైద్యశిబిరం, ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినిల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని మాత్రలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. కె.లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ బి.సుమలత, కళాశాల హెల్త్ సూపర్‌వైజర్ పి. సుమలత, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడిచేసిన వారిని శిక్షించాలి



వేములవాడ : నిరసన తెలుపుతున్న అడ్వకేట్లు

వేములవాడ: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాది తన్నీరు శ్రీకాంత్‌పై కొంతమంది దుండగులు దాడి చేసి తీవ్రంగా గాయపరచడాన్ని నిరసిస్తూ న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి, కోర్టు గేటు ముందు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గుండ రవి మాట్లాడుతూ న్యాయవాదులకు ప్రభుత్వం లైసెన్సుడు, గన్‌లను ఇప్పించాలని, కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు కట్కం జనార్దన్, అడ్వకేట్లు నాగుల సత్యనారాయణ, నేరెళ్లి తిరుమల్‌గౌడ్, పిట్టల మనోహర్, ఆర్. దేవేందర్, పెంట రాజు, దేవయ్య, అన్నపూర్ణ, నయీమానాసరి, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

సిరిసిల్లకల్చరల్: న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే అమల్లోకి తీసుకురావాలని జిల్లా న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లో తన్నీరు శ్రీకాంత్ అనే న్యాయవాదిపై జరిగిన దాడిని ఖండిస్తూ విధులు బహిష్కరించిన న్యాయవాదులు కోర్టు ఆవరణలో నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీకాంత్‌పై దాడిని నిరసిస్తూ రాష్ట్రంలోని అన్ని కోర్టుల్లో విధులు బహిష్కరణ చేపట్టినట్లు తెలిపారు. సంఘం ప్రతినిధులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మున్నూరు కాపు సంఘం నాయకులు



కేటీఆర్‌తో మున్నూరుకాపు మండల సంఘం నాయకులు

గంభీరావుపేట: మండల మున్నూరుకాపు సంఘం నాయకులు మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను కలిశారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన సంఘ పాలవర్గ సభ్యులకు కేటీఆర్ హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, నాయకులు మేకార్తి భిక్షపతి, కిరణ్‌బాబు, గంధ్యాడపు శంకర్, రా జు, కొమిరిశెట్టి లక్ష్మణ్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



పొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటుతున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

ఇల్లంతకుంట: మండలంలోని పొత్తూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు మంగళవారం మొక్కలు నాటారు. మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు దివ్య, పూజిత, వసుంధర, అశ్రిత, శ్రేయ, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట: మండల కేంద్రంలోని మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విప్ మాట్లాడారు. మహనీయుల అడుగుజాడల్లో ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీసీ రిజర్వేషన్లు అమలయితే బీసీలకు విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గౌడసంఘం అధ్యక్షుడు అబ్బసాని శంకర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ ఎల్లయ్య, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, నాగుల సత్యనారాయణ, షేక్ ఫిరోజ్‌పాషా, మల్యాల దేవయ్య, చేపూరి గంగాధర్, చంద్రయ్యగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, గొట్టె రుక్మిణి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న టీఎల్ఎం మేళా



ప్రదర్శనను తిలకిస్తున్న అధ్యాపకులు

గంభీరావుపేట: గంభీరావుపేట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం టీఎల్ఎం మేళా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన సృజనాత్మక వస్తువులను ప్రదర్శించారు. పలు వస్తు ప్రదర్శనలను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. ఎంఈవో గంగారాం, డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మీ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు టీఎల్ఎం మండలస్థాయి మేళా మంగళవారం నిర్వహించారు. మండల సెస్ డైరెక్టర్ మాడుగు మల్లేశం ప్రారంభించారు. మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు లకావత్ రాములు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో అన్ని పాఠశాల్లో మేళాలు నిర్వహించి ఎంపికైన పాఠశాలలు ఈనెల 28న జరిగే జిల్లాస్థాయి టీఎల్ఎం మేళాలో పాల్గొంటారన్నారు.

కోడెలకు పశుగ్రాసం అందించాలి

వేములవాడరూరల్: కోడెలకు పశుగ్రాసం అందించాలని ఆలయ పూజారి భక్తులను కోరుతున్నాడు. విన్నవించాడు. వేములవాడ రూరల్ మండలం నాగాయపల్లిలో శ్రీ దుర్గా రాజరాజేశ్వరస్వామి ఆలయం ఉంది. రాజన్నకు భక్తులు కోడెమొక్కులు చెల్లిస్తారు. ఈ ఆలయంలో భక్తులు శ్రీ దుబ్బ రాజరాజేశ్వరస్వామికి నిజకోడెలు ఇంటినుంచి తీసుకువచ్చి సమర్పిస్తారు. భక్తులు సమర్పించిన ఈ కోడెలకు పశుగ్రాసం లేకపోవడంతో కోడెలు బక్కచిక్కిపోతున్నాయి. పశువులకు గడ్డిని అందజేయాలని పూజారి మల్లేశం కోరుతున్నారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట: మండలంలోని మధ్యమానేరు ప్రాజెక్టు నుండి 9,600 క్యూసెక్కుల నీరు అనంతగిరి అన్నపూర్ణ రిజర్వాయర్లోకి వచ్చి చేరుతుంది.అన్నపూర్ణ ప్రాజెక్టు నుంచి రంగనాయక సాగర్ ప్రాజెక్టులోకి 9,900 క్యూసెక్కుల నీరు వెళ్తోందని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 3.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.38 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

యూరియా కోసం బారులు



పెద్దూరు సింగిల్‌విండో వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

సిరిసిల్ల అర్బన్/ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు సింగిల్‌విండో కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం బారులుతీరారు. ఉదయాన్నే వచ్చి క్యూ లైన్‌లో నిల్చున్నారు. కేవలం 250 బస్తాలు మాత్రమే రావడంతో ముందుగా వచ్చిన రైతులకు యూరియా బస్తాలు వచ్చాయి. మిగతా రైతులకు యూరియా దొరకకపోడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికై నా రైతులకు సరిపడా యూరియా తీసుకు రావాలని సింగిల్‌విండో సిబ్బందిని కోరారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లోని ప్రాథమిక సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు పాట్లు పడ్డారు. యూరియా కోసం రైతులు ఉదయమే క్యూ లైన్ కట్టారు. అల్మాస్‌పూర్‌కు 400 బస్తాలతో లోడు వచ్చింది. మొత్తం లోడు ఇక్కడే దించాలని రైతులు పట్టుబట్టారు. 250 బస్తాలు మాత్రమే దించుతామని చెప్పడంతో రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎస్సై రాహుల్ రెడ్డి, వ్యవసాయాధికారి రాజశేఖర్ అక్కడికి చేరుకుని రైతులను శాంతింపజేశారు. బుధవారం మరో లోడు యూరియాను తెప్పిస్తామని వ్యవసాయాధికారి హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

- పలువురికి గాయాలు

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్ శివారు సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి బస్సు, లారీ ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో వేములవాడకు వెళ్తోంది. అదే సమయంలో పద్మనగర్ ప్రమాదకర మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న పది మందికి గాయాలయ్యాయి. ట్రాఫిక్ జాం కావడంతో సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి ఎస్సై ఉపేంద్రచారి, సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. క్షతగాత్రులను 108లో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మండెపల్లి నుంచి కేసీఆర్‌నగర్ మీదుగా బద్దెనపల్లి వరకు ట్రాఫిక్‌ను మళ్లించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

దళితవాడల సందర్శన

బోయినపల్లి: రత్నంపేటలో సీపీఎం ఆధ్వర్యంలో దళితవాడలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నట్లు మండల సీపీఎం కన్వీనర్ గురజాల శ్రీధర్ మంగళవారం తెలిపారు. కొత్త మురుగుకాలువల నిర్మాణం, వీధిలైట్ల వ్యవస్థ, సిమెంట్ రోడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. రామంచ అశోక్, పర్లపల్లి అంజయ్య, రామంచ దుర్గయ్య, మార నర్సయ్య, రామంచ కవిత, రామంచ అంజలి, బాబు, కనకయ్య, రాము తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ బిల్లులు మంజూరు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మొదటి విడత బిల్లు రూ.లక్ష మంగళవారం మంజూరైంది. మండల కేంద్రానికి చెందిన రాగుల రేణుక, కటకం శ్రీలత, బుర్క రమ్య, గుంటుక నవిత, బుర్క రేవతిలకు రూ.లక్ష చొప్పున బిల్లులు వచ్చాయి.

మధ్యమానేరుకు ఎస్సారెస్పీ జలాలు



వరదకాలువ ద్వారా వస్తున్న నీరు

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర (మిడ్‌మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి భారీగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎస్సారెస్పీ నుంచి 16,565, గాయత్రీ పంప్‌హౌస్ నుంచి 3,150 క్యూసెక్కుల మేర నీరు తరలుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి ఎల్ఎండీకి 10వేలు, ప్యాకేజ్-10 అనంతగిరి ప్రాజెక్టులోకి 9,600 క్యూసెక్కుల మేర నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం మంగళవారం 17.683 టీఎంసీలకు చేరింది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం బృందం

ముస్తాబాద్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మైనర్లు వాహనాలు నడపరాదని షీటీం అధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని కొండాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరైన బాలికలను వేధిస్తే షీటీంను ఆశ్రయించాలని, 100 డయల్ చేయాలన్నారు. బాల్య వివాహలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థుల రక్షణకు షీటీం ఎప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ డీలర్లకు ప్రశంసాపత్రాలు

ఎల్లారెడ్డిపేట: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసిన డీలర్లకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మంగళవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. పత్రాలు అందుకున్న వారిలో బొమ్మకంటి రవీందర్‌గుప్తా, సింగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, చేపూరి శ్రీకర్‌గుప్తా, మెండే శ్రీనివాస్‌యాదవ్, రామ భిక్షపతి, గంజి వేణు, బొమ్మకంటి అశోక్, పెండ్యాల సంతోష్‌రెడ్డి, సాయిచరణ్, పెంజర్ల శ్రీశైలం ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• ప్రో కబడ్డీ పోటీల పరిశీలకుడిగా మదన్

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రో కబడ్డీ చాంపియన్ షిప్-2025 పోటీలకు పట్టణానికి చెందిన పీఈటీ బడావత్ మదన ఎంపికయ్యారు. ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 5వరకు హైదరాబాద్‌లో జరిగే యువ తెలంగాణ ప్రో కబడ్డీ చాంపియన్ షిప్-25 పోటీలకు మదన్ ఎంపికవడంపై జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గం, ప్రతినిధులు ముస్కు మల్లారెడ్డి, సింగారం తిరుపతి, సీహెచ్. సంపత్‌రావు తదితరులు అభినందనలు తెలిపారు.

• బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: బీజేపీ నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ దిష్టిబొమ్మను దహనం చేయడం సరికాదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. దిష్టిబొమ్మ దహనంపై బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రాహుల్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

• చోరీకి యత్నం

కోనరావుపేట: మామిడిపల్లికి చెందిన కాటిపెల్లి కాంతవ్వ అనే వృద్ధురాలి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. కాంతవ్వ వారం రోజుల క్రితం కూతురు ఇంటికి వెళ్లి మంగళవారం సాయంత్రం ఇంటికి వచ్చింది. ఇల్లు తాళం పగులగొట్టి ఉండటంతో గ్రామస్తులకు సమాచారం అందించింది. ఇంట్లో వస్తువులు ఏమీ పోలేదని గ్రామస్తులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

• చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఎల్లారెడ్డిపేట: మద్యం తాగొద్దని తండ్రి మందలించినందుకు మనస్తాపంతో గడ్డి మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు. మండంలోని బుగ్గరాజేశ్వరతండాకు చెందిన గుగులోత్ బాబూరావుకు ముగ్గురు కుమారులు. చిన్న కొడుకు నవీన్(25) బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లి మూడు నెలల క్రితం వచ్చాడు. అప్పటి నుంచి ఏ పని చేయకుండా తిరుగుతున్నాడు. ఈనెల 21న స్నేహితుడి పెళ్లి వేడుకకు వెళ్లి, మద్యం తాగి ఇంటికి రాగా.. తండ్రి బాపురావు మందలించాడు. మనస్తాపం చెందిన నవీన్ గడ్డి మందు తాగాడు. మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

గజసింగవరంలో..

గంభీరావుపేట: మండలంలోని గజసింగవరంకు చెందిన రాయలింగు సతీశ్ (35) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సతీశ్ ఆర్థిక సమస్యలతో బాధపడుతూ ఈనెల 21న పురుగుల మందు తాగాడు. ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ పేర్కొన్నారు.

• ఎస్టీయూ సభ్యత్వ నమోదు

రుద్రంగి: ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల స్థానాల్లో, విద్యా వలంటీర్ల నియామకానికి ఉత్తర్వులు జారీచేయాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని పాఠశాలలలో సభ్యత్వం స్వీకరించి అనంతరం మానాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ రుద్రంగి మండలశాఖ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్, ఎన్నికల అధికారిగా ప్రధాన కార్యదర్శి రేవోజు సదానందం వ్యవహరించారు. ఎస్టీయూ రుద్రంగి మండల అధ్యక్షుడిగా తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శిగా షేక్ హైమద్, కోశాధికారిగా ఏం. వెంకటలక్ష్మి, మహిళా ఉపాధ్యక్షులుగా సుమతి, జిల్లా కార్యదర్శిగా బి.నవీన్, కార్యదర్శులుగా ఏం. స్వప్న, కె. స్వరూపరాణి, పూర్ణిమ, సరితా దేవిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా నాయకులు, మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.